# కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

- ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలి
- ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు
- 23 రౌండ్లు.. 14 టేబుళ్ల ఏర్పాటు
- భూపాలపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 1: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత నోడల్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేశ్‌మిశ్రా మాట్లాడుతూ డిసెంబర్ 3న ఉదయం 8 గంటలకు స్థానిక అంబేద్కర్ స్టేడియంలోని మినీ ఫంక్షన్ హాల్‌లో భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి కౌంటింగ్ ప్రకియ ప్రారంభమవుతుందని అన్నారు. ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్‌కు ఈవీఎం యంత్రాల తరలింపు ప్రక్రియ సీసీ కెమెరాల్లో రికార్డయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్ల వివరాలు చూపించి, తర్వాత అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను అందరికి స్పష్టంగా తెలిసేలా చూపించాలన్నారు. వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ హాలులో 14 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నామని, ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3 రిజర్వు బృందాలు, 3 పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయని, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 23 రౌండ్లు ఎన్నికల కౌటింగ్ ఉంటుందని, 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో కౌటింగ్ ప్రారంభం అవుతుందని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 5 ఈవీఎంలను లాటరీ పద్ధతిన ఎంపిక చేసి, వీవీ ప్యాట్ల ఓట్ల లెక్కింపు చేయనున్నామని, కౌంటింగ్ హాల్లో అధికారులు, సిబ్బంది మౌనంగా ఉండాలని, ప్రశాంతంగా లెక్కింపు ప్రక్రియ చేయాలని, గందరగోళానికి గురికావద్దని సూచించారు. వీవీ ప్యాట్ల స్లిప్పుల లెక్కింపు అప్రమత్తంగా చేయాలని, వాటిని బ్లాక్ కవర్‌లో భద్రపరిచి సీల్ చేయాలని, ఈ ప్రక్రియ మొత్తం వీడియో గ్రాఫీ చేయాలని అన్నారు. ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత ఆ రౌండ్‌లో ప్రతి అభ్యర్థికి వచ్చిన ఓట్ల వివరాలను ఎన్నికల కమిషన్ నిర్దేశించిన పోర్టల్‌లో నమోదు చేసి రిటర్నింగ్ అధికారికి అందించాలన్నారు. కంట్రోల్ యూనిట్లు ఓపెన్ కాని పక్షంలో రిటర్నింగ్ అధికారికి వెంటనే సమాచారం అందించాలని, కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదని తెలిపారు. కౌటింగ్ కేంద్రం వద్ద అవసరమైన తనిఖీ నిర్వహించేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం కలెక్టర్ ఎస్పీ కిరణ్ ఖారేతో కలిసి కౌంటింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రిటర్నింగ్ అధికారి రమాదేవి, డీఎస్పీ రాములు, డీపీఆర్వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

# రేపు ఓట్ల లెక్కింపు

- భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): భూపాలపల్లి నియోజకవర్గ సాధారణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రేపు వెలువడనున్నాయి. అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో గల మినీ ఫంక్షన్ హాల్‌లో అధికారులు ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. 14 టేబుల్స్ ఏర్పాటు చేసి 23 రౌండ్లలో ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు. ఇందుకోసం కలెక్టర్ భవేశ్‌మిశ్రా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ అభయ్ నందన్ కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్లను మూడు టేబుళ్ల ద్వారా లెక్కిస్తారు. అనంతరం ఈవీఎంలలోని ఓట్లను కౌంటింగ్ చేస్తారు. 14 టేబుళ్లలో ఒక్కో టేబుల్‌కు నలుగురు సిబ్బంది చొప్పున మొత్తం 56 మంది సిబ్బంది కౌంటింగ్‌లో పాల్గొంటారు. ముగ్గురు నోడల్ ఆఫీసర్లు, ఆరుగురు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 12మంది కౌంటింగ్ అసిస్టెంట్లు కౌంటింగ్ విధుల్లో పాల్గొంటారు. ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికలు ముగియడంతో ఈవీఎంలను అంబేద్కర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి పోలింగ్ సిబ్బందికి ఆయా పార్టీల నాయకులకు అవగాహన కల్పిస్తున్నారు.

# నిఘా నీడలో స్ట్రాంగ్ రూమ్

కృష్ణకాలనీ, డిసెంబర్1: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భారీ బందోబస్తు నడుమ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియం ఆవరణలో గల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. గురువారం అర్ధరాత్రి నుంచి స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీసులు 24 గంటలు బందోబస్తు నిర్వహిస్తున్నారు. చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి భవేశ్‌మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖారే ఎప్ప టికప్పుడు స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను పర్యవేక్షించారు. ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. అదేవిధంగా ఈనెల 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉండడంతో అంబేద్కర్ స్టేడియం ఆవరణలో గల మినీ ఫంక్షన్ హాలులో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు.



పోలీసుల బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూమ్

# పోలింగ్ సరళిపై ఎమ్మెల్యే గండ్ర సమీక్ష

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): భూపాలపల్లి నియోజకవర్గంలో గురువారం జరిగిన ఎన్నికలపై శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆయా మండలాల్లో పోలింగ్ సరళిపై ఆరా తీశారు. నియోజక వర్గంలోని దాదాపుగా సగంకి పైగా గ్రామాల్లో అధికంగా ఓటింగ్ శాతం నమోదైందని, ఆయా మండలాల్లో పెరిగిన ఓట్లు ఎవరికి అనుకూలిస్తాయి, పరిస్థితి ఎలా ఉంది అంటూ నాయకులతో ఆరా తీశారు. గ్రామాల్లో ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన వారు దాదాపుగా బీఆర్‌ఎస్‌కే ఓట్లు వేశారని నాయకులు వెల్లడించారు. టేకుమట్ల మండలంలో 2వేల మెజార్టీ వస్తుందని జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. అన్ని మండలాల్లో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ వస్తుందని, 10వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తామని నాయకులతో తెలిపారు. సమీక్షలో రేగొండ పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి విజ్జన్ రావు, ఎంపీటీసీలు ఆది రఘు, సంపత్‌రావు, సారయ్య, పార్టీ సీనియర్ నాయకులు పింగిలి రవీందర్‌రెడ్డి, తోకల విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమీక్షలో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

# కన్నుల పండువగా రాములోరి కల్యాణం

- తరలివచ్చిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

లింగాలఘనపురం, డిసెంబర్ 1 : మండలంలోని జీడికల్ రాములోరి కల్యాణం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. తిరు కల్యాణాన్ని తిలకించేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా నల్లగొండ, హైదరాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రామ, లక్ష్మణ, హనుమ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపైకి చేర్చారు. మరో పల్లకీలో సీతమ్మ విగ్రహాన్ని చేర్చి, మేళతాళాలతో ఆలయం నుంచి బయట నిర్మించిన కల్యాణ మండపం పైకి చేర్చారు. పూజా సామగ్రిని దేవాదాయశాఖ ఆర్‌జేసీ రాంకృష్ణారెడ్డి, నల్లగొండ ఏసీ మహేంద్రకుమార్, జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, ఎంపీపీ జయశ్రీపేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కొండబోయిన కిరణ్‌కుమార్, ఈవో శేషుభారతి, మాజీ చైర్మన్ సానికె మధు వేదికపైకి చేర్చారు. పునర్వసు నక్షత్రయుక్త కర్కాటక లగ్నంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా జరిపారు. దేవాదాయ శాఖ ద్వారా పట్టు వస్త్రాలు, తలంబ్రాలను ఆ శాఖ ఆర్‌జేసీ రాంకృష్ణారావు, ఏసీ మహేంద్రకుమార్ స్వామివారికి సమర్పించారు. యాగ్నికులు గట్టు శ్రీనివాసాచార్యులు, విజయసారథి, పూజారులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, రాఘువాచార్య లు, ఆచార్య వర్చిశ్, బుచ్చయ్య శర్మ కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమాల్లో నాయకులు బొల్లంపెల్లి నాగేందర్, బోయిని రాజు, కత్తుల శ్రీపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, కూకట్ల మల్లయ్య చౌదరపెల్లి శేఖర్, ఉప్పల మధు, చౌదరపెల్లి పూర్ణచందర్, సిబ్బంది కేకే రాములు, రాజేందర్‌రెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి, మధు, భరత్‌కుమార్, మల్లేశం పాల్గొన్నారు. ఎంపీపీ చిట్ల జయ శ్రీ స్వామి వారికి, అర్చకులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈవో శేషుభారతి, సిబ్బంది పాల్గొన్నారు.



మంగళ సూత్రాన్ని చూపిస్తున్న పూజారి



పూజా సామగ్రిని తీసుకొస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ దంపతులు